# దేవుడైనా మోకరిల్లాల్సిందే

కె.వి. జగన్నాథరావు*

మా బారువా ప్రాంతం బాలగోపాల్‌కి ఎంతో రుణపడి ఉంది. థర్మల్ కాలుష్యానికి సోంపేట సొమ్మసిల్లిపోకముందే, కొత్త అభివృద్ధి నమూనాకు బీల, తంపర భూములు ఎండి ఎడారులు కాకముందే, స్థానిక ప్రజల జీవితాలు ఆ ఎడారుల్లో తడారక మునుపే బాలగోపాల్ ఆ విధ్వంసక దృశ్యాన్ని పసిగట్టారు. పసిగట్టి ప్రమాద హెచ్చరిక చేశారు. ప్రజలు కూడా ఆయన హెచ్చరికను పెడచెవిన పెట్టలేదు. బాలగోపాల్ అటువంటి నమ్మకాన్ని కలిగించారు ప్రజల్లో. ఏ నాయకుడూ, ఏ రాజకీయ పక్షమూ తోడు రాకపోయినా బారువా-సోంపేట ప్రజలు స్వతంత్రంగా పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాటం చేశారు. ఇంకా చేస్తున్నారు.

బాగా వెనక్కి వెళితే జీరుపాలెం మత్స్యకారులు నడిపిన పోరాటానికీ బాలగోపాల్ అండ ఉంది. తాము వేట చేసుకొచ్చిన మత్స్య సంపదలో కొంత భాగాన్ని స్థానిక భూస్వామి శ్రీరాములు నాయుడు కాజేస్తుంటే దశాబ్దాలుగా సాగుతున్న ఆ దోపిడికి వ్యతిరేకంగా మత్స్యకారులు తిరగబడ్డారు. ఆగ్రహంతో ఆ భూస్వామి గ్రామం మొత్తాన్నీ తగులబెట్టాడు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి బాలగోపాల్ ఆనాడు ప్రధాన కార్యదర్శి. వారిపై జరిగిన దురాగతాన్ని బయటి ప్రపంచానికి తెలియజేయడంలో ఆయన విశేషమైన కృషి చేశారు.

ఇటీవల 2007 మే నెలలో శ్రీకాకుళంలో మానవహక్కుల వేదిక రెండవ రాష్ట్ర మహాసభలను జరుపుకున్నాం. సభలు విజయవంతం కావడం, సంఘం బలపడటం

* మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాకుళం

స్వతంత్ర హక్కుల ఉద్యమం కోసం పోరాటం చేసుకుంటూ వచ్చిన బాలగోపాల్‌కి గొప్ప ఆనందాన్ని ఇచ్చాయి.

## ఊపిరి పీల్చినట్టే పని చేయాల్సొచ్చేది

బాలగోపాల్‌గారి గురించి రాయాలన్నా, చెప్పాలన్నా ఎవరైనా కొంచెం మాత్రమే చేయగలం. పూర్తిగా చెప్పడం ఏ ఒక్కరికీ సాధ్యం కాదనుకుంటున్నాను. ఆయనతో పని చేయడం మాత్రం అందుకు విరుద్ధం. కొంచెం కొంచెం చేసి పూరుకోలేం. పూర్తిగా నిమగ్నమవ్వాల్సిందే. కళ్లార్పడం, ఊపిరి పీల్చడం ఎంత సహజంగా చేస్తామో పని కూడా అలా అలవాటయ్యేలా చేస్తారాయన.

తొలిసారి 1986లో ఆయనతో నాకు పరిచయం ఏర్పడింది. ఆనాటినుంచీ ఇప్పటి వరకూ ఆయన వందలసార్లు శ్రీకాకుళాన్ని సందర్శించారు. జీరుపాలెం ఘటన నాటినుంచి నిన్నటి సోంపేట ఘటన వరకూ జిల్లాలో హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా జరిగిన అన్ని పోరాటాల వెనుకా బాలగోపాల్ గారి పాత్ర, మార్గదర్శకత్వం ఉన్నాయి.

జిల్లాలో హెచ్.ఆర్.ఎఫ్ బలపడటానికి ఆయన మాకందరకూ నేర్పిన పని విధానమే కారణం. పదిమంది తోడు వచ్చినా, రాకపోయినా ఆయన తన కర్తవ్యాన్ని ఎప్పుడూ నిర్వహించకుండా ఉండిపోలేదు. కదిలించేవారు ఒక్కరున్నా చాలు చైతన్యం రగిలించవచ్చుననుకునే మనస్తత్వం ఆయనది. నిర్బంధం కారణంగా శ్రీకాకుళం జిల్లా ఎపిసిఎల్‌సి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు రాజీనామాలు చేసిన ఒక సందర్భంలో యూనిట్ మొత్తం రద్దయ్యింది. అయినా కూడా జిల్లాలో ఎపిసిఎల్‌సి కార్యక్రమాలు జరిగాయి. ఆయన ఒంటరిగా వచ్చి కార్యక్రమాలను నడిపేవారు. ఆయన తీసుకున్న ఈ వైఖరి జిల్లా యూనిట్ పున:ప్రారంభానికి దోహదం చేసింది.

మాటల్లో క్లుప్తత, విశ్లేషణలో గాఢత, పనిలో తాదాత్మ్యత ఆయనకే సొంతమైన లక్షణాలు. ఎంతటి పెద్ద విషయాన్నైనా ఫోనులో చాలా క్లుప్తీకరించి చెప్పేవారు. ఆయన అఫిడవిట్లు కూడా అలాగే క్లుప్తంగా, సూటిగా ఉంటాయని, అనవసర ప్రసంగం చేయరనీ న్యాయవాదులు అంటారు.

కేసులు, ఫీజుల విషయంలో ఆయన ఎంత కచ్చితంగా ఉంటారో నాకు తెలిసిన ఒక ఉదాహరణ చెపుతాను. ఒకసారి విశాఖపట్నంలో ఒక లాయరు ఒక కేసు అప్పగించబోయారు. బాలగోపాల్‌గారు రెండు ప్రశ్నలు అడిగారు. 'దళితులకు వ్యతిరేకమా', 'స్త్రీలకు వ్యతిరేకమా' అని. రెండూ కాదు, రివిజన్ అని చెప్పి ఆ న్యాయవాది 5 వేల రూపాయల ఫీజు ఇవ్వబోయారు. బాలగోపాల్‌గారు 2 వేలు చాలు అన్నారు. 'పర్వాలేదు సార్ నా సొంతం కాదు. పార్టీ ఇచ్చింది' అన్నాడతను. 'నీవు

పాడైపోతే నీ ఇష్టం. కాని నన్ను పాడు చేస్తానంటే నేను ఒప్పుకోను' అని సున్నితంగా నవ్వుతూ రెండు వేలే తీసుకున్నారు.

బాలగోపాల్‌ని అందరూ సీరియస్ వ్యక్తని అనుకుంటూ ఉంటారు. కానీ ఆయనలో హాస్యం పాలు తక్కువేం కాదు. ఒకరోజు మా ఇంటివద్ద భోజనం చేసి రాసుకుంటున్నారు. ఉడకపెట్టిన శెనక్కాయలు ఇచ్చాను. తిన్నారు. తర్వాత పాలు ఇచ్చాను. తాగారు. తర్వాత వక్కపొడి వేసుకుంటారా అని అడిగాను 'ఇందాకటి నుంచి చూస్తున్నాను. చివరికి నాచేత గడ్డికూడా తినిపించేలా ఉన్నావే!' అని నన్ను ఎగతాళి చేశారు.

ఒక మనిషి తాను ఏవిధంగా ఉండాలని నిర్ణయించుకుంటాడో అదే విధంగా, అదే కమిట్‌మెంట్‌తో సుదీర్ఘకాలం, జీవితాంతం పనిచేయడం ఊహించుకోవడానికే కష్టం. సాదాసీదా జీవితశైలిని గడుపుతూ చివరకు బట్టలూ, చెప్పులూ, ఆరోగ్యం వంటి విషయాలను కూడా పట్టించుకునేవారు కాదు. మనిషి పతనం 'స్వంతం' గురించి ఆలోచించడంతోనే ఆరంభమవుతుందంటారు. బహుశా బట్టలూ, చెప్పులూ వంటివి ఆ పతనానికి మొదటి మెట్టనుకునే వారేమో బాలగోపాల్. ఆ మొదటి మెట్టును కూడా తాకని ఆయన వ్యక్తిత్వం ముందు దేవుడైనా మోకరిల్లవలసిందే.